నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, గురువారం 26 సెప్టెంబర్ 2024 | KAMAREDDY



• బోధన్‌లోని చారిత్రక నిజాం షుగర్ ఫ్యాక్టరీని సెప్టెంబర్ 17 లోపు తెరిపిస్తాం. రైతులకు, కార్మికులకు అండగా నిలుస్తాం.
• మే 8న నిజామాబాద్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ఇది

## సీఎం గారు.. పునరుద్ధరణ ఏమైంది?

అసెంబ్లీతోపాటు లోక్‌సభ ఎన్నికల వేళా నిజాం షుగర్స్ పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ గొప్పలకు పోయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత అధికారం చేపట్టిన హస్తం పార్టీ.. ఆ దిశగా పెద్దగా చర్యలు చేపట్టలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలు రావడంతో హడావుడిగా ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఎలక్షన్లకు ముందు ఆ కమిటీ ఒకసారి మాత్రమే ఫ్యాక్టరీని సందర్శించి, రైతులతో మాట్లాడి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఎన్నికల ప్రచారంలో భాగంగా మే 8న నిజామాబాద్‌కు వచ్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో కీలక ప్రకటన చేశారు. సెప్టెంబర్ 17లోగా ఫ్యాక్టరీని తెరిపిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటింది. ఫ్యాక్టరీ పునరుద్ధరణపై రేవంత్ ప్రకటించిన గడువు ముగిసి పది రోజులై పోయింది. అయినా సీఎం మాట అమలు కాలేదు. ఫ్యాక్టరీ తెరుచుకోలేదు.

## అంతా మోసమే..

ఎన్నికల వేళ హామీలు గుప్పించడం, తర్వాత గాలికొదిలేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీలు, డిక్లరేషన్ల పేరుతో అన్ని వర్గాలపై వరాల జల్లును కురిపించింది. రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా, పంటలకు మద్దతుధర, వడ్లకు రూ.500 బోనస్ వంటి హామీలతో రైతులను మభ్యపెట్టింది. అధికారంలోకి రాగానే కొందరికే రుణమాఫీ చేసి మిగతా వారికి ఎగనామం పెట్టింది. వానకాలం ఆరంభంలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయం ఎగ్గొట్టింది. బోనస్ సన్నవడ్లకే వర్తింపు అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్న సర్కారు.. మద్దతు ధర విషయంలో మాట కూడా మాట్లాడట్లేదు.

# సారు.. ఇదేనా తీరు?

## మరోసారి మాట తప్పిన సీఎం




- షుగర్ ఫ్యాక్టరీని సెప్టెంబర్‌లో పునరుద్ధరిస్తాం..
- ముఖ్యమంత్రి హోదాలో ప్రకటించిన రేవంత్
- గడువు ముగిసినా తెరుచుకోని ఫ్యాక్టరీ
- హామీలు ఎగ్గొట్టడంలో ముందున్న కాంగ్రెస్ సర్కారు
- మండిపడుతున్న చెరుకు రైతులు, కార్మికులు

*మాట తప్పడం.. మడమ తిప్పడం కాంగ్రెస్ నైజంగా మారి పోయింది. ఓట్ల కోసం హామీలు గుప్పించడం, ఆ తర్వాత ఎగవేయడం హస్తం పార్టీకి పరిపాటిగా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఎగ్గొట్టారు. మళ్లీ లోక్‌సభ ఎలక్షన్ల ముందర అలాగే వరాలు కురిపించి, ఎన్నికలవ్వగానే ఓటర్లకు 'చేయి'చ్చారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకే దిక్కు లేకుండా పోయింది. సెప్టెంబర్ 17లోపు నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని ఇందూరు గడ్డపై సీఎం చేసిన ప్రకటన ఉత్త మాటగానే మిగిలి పోయింది.*


నిజామాబాద్, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ నైజం మరోసారి తేటతెల్లమైంది. రుణమాఫీ, రైతు భరోసా, మద్దతు ధర హామీల్లాగే.. నిజాం షుగర్స్ పునరుద్ధరణ విషయంలోనూ అధికార పార్టీ అన్నదాతలకు మరోసారి రిక్త'హస్తమే' చూపింది. సెప్టెంబర్ 17లోగా ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని ఏకంగా సీఎం హోదాలో రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనకే దిక్కు లేకుండా పోయింది. ఓట్ల కోసం, సీట్ల కోసం రైతులు, ప్రజలను కాంగ్రెస్ ఏవిధంగా మభ్యపెడుతుందో చెప్పడానికి ఈ ఒక్క ఉదంతం చాలు.

### ముందడుగేది..?

మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు.. రైతులు, కార్మికులు, రాజకీయ పక్షాల అభిప్రాయాలను ఈ ఏడాది ఫిబ్రవరి 24న తెలుసుకున్నారు. చెరుకు రైతులకు పర్చేస్ ట్యాక్స్, రాయితీని పరిశీలిస్తామన్నారు. అయితే, ప్రైవేట్ యాజమాన్యం బ్యాంకులకు చెల్లించాల్సిన అప్పుల విషయంలో మాత్రం స్పష్టతనివ్వలేదు. మరోవైపు, ఫ్యాక్టరీ పునరుద్ధరణ, చెరుకు సాగు వైపు రైతులను మళ్లించడం, శిథిలావస్థకు చేరిన యంత్రాలకు మరమ్మతులు, కార్మికుల బకాయిల విషయంలో ఏమాత్రం స్పష్టత ఇవ్వలేదు. పునరుద్ధరణ అంటే ప్రభుత్వమే మొత్తం ఫ్యాక్టరీని చేతుల్లోకి తీసుకుని నడుపుతుందా? లేదంటే ఇప్పుడున్న యాజమాన్యానికే బాధ్యతలు ఇస్తుందా? అన్నది జవాబు లేని ప్రశ్నగా మారింది. శ్రీధర్ బాబు నేతృత్వంలోని మంత్రుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా యాజమాన్యాన్ని మార్చేసి కొత్త వారికి ఫ్యాక్టరీని కట్టబెడతారా? అన్నది తేలాల్సి ఉంది.

### కార్మికుల గోస పట్టని సర్కారు..

2015 డిసెంబర్‌లో ఎన్‌డీఎస్‌ఎల్ యాజమాన్యం అకస్మాత్తుగా లేఆఫ్ ప్రకటించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు కార్మికులకు వేతనాలు రావాలి. ఈ వేతన బకాయిలు, నిజాం షుగర్స్ పునరుద్ధరణకు సంబంధించి వినతిపత్రం ఇద్దామని ప్రభుత్వంలోని పెద్దలను కలిసేందుకు కార్మికులు ప్రయత్నిస్తుంటే, కలువకుండా ముఖం చాటేస్తున్నారు. 2024-25 అసెంబ్లీ బడ్జెట్‌లో నిజాం షుగర్స్‌ను పునరుద్ధరిస్తామని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తన ప్రసంగంలో చెప్పారు. సెప్టెంబర్ నెలాఖరుతో ఈ ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతున్నా ఆ దిశగా అడుగులే పడడం లేదు. జాయింట్ వెంచర్‌లో ఉన్న ఈ ఫ్యాక్టరీని ముందు ప్రైవేట్ యాజమాన్యం పెత్తనం నుంచి విడిపించాలి. ఇందుకు ఏం చేస్తారో మాత్రం చెప్పలేదు. ఇక, పునరుద్ధరణపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కూడిన కమిటీ ఫ్యాక్టరీ భవితవ్యంపై ఏ నిర్ణయం తీసుకుందన్న అంశంపై స్పష్టత లేకుండా పోయింది.





## కామారెడ్డిలో
# కుక్కల కలకలం

- ఆరుగురిపై దాడి చేసిన శునకాలు
- రోడ్లపైకి వెళ్లేందుకు జంకుతున్న జనాలు





కామారెడ్డిలోని ఓ కాలనీలో తిరుగుతున్న కుక్కలు

కామారెడ్డి, సెప్టెంబర్ 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలో వీధి కుక్కలు బుధవారం వీరంగం సృష్టించాయి. ఆరుగురు మహిళలపై దాడి చేశాయి. శేర్‌గల్లి, వికాస్‌నగర్, ఆర్‌బీనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం ఆరుగురిని తీవ్రంగా గాయపరిచాయి. వీరిలో సత్తెవ్వ అనే మహిళ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. రాజమణి, కళావతితో పాటు మరో ముగ్గురిని స్థానిక ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు.

**గుంపులు గుంపులుగా..**

జిల్లా కేంద్రంలో ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. రోడ్డుపై వెళ్లే వారి వెంటపడి దాడి చేస్తున్నాయి. వాహనాలపై వెళ్లే వారిని సైతం భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. శునకాల భయంతో పిల్లలు, పెద్దలు ఇంటి నుంచి బయటికి వచ్చేందుకు భయపడుతున్నారు. సిరిసిల్ల రోడ్, స్టేషన్ రోడ్, సుభాష్‌రోడ్, విద్యానగర్, ఆర్‌బీ నగర్, లిబ్రా ఫంక్షన్ హాల్ తదితర ప్రాంతాల్లో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ కనబడ్డ వారిపై దాడి చేస్తూ పిక్కలు పీకుతున్నాయి. మార్నింగ్ వాక్‌కు వెళ్లే వారిని, ఒంటరిగా వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. శునకాల బెడదపై పలుమార్లు మున్సిపాలిటీలో ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆయా కాలనీల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలు పోకముందే మున్సిపల్ అధికారులు కుక్కలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నారు.

# దాడి చేసిన వారిని వదలం

- అల్లర్లకు పాల్పడ్డ వారిపై కేసులు
- జీవదాన్ పాఠశాల ఘటనపై ఎస్పీ వెల్లడి




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, సెప్టెంబర్ 25: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో మంగళవారం జరిగిన విధ్వంసంతో పాటు పోలీసులపై దాడి చేసిన వారిని వదిలి పెట్టేది లేదని ఎస్పీ సింధూశర్మ వెల్లడించారు. కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. జీవదాన్ పాఠశాలలో చదువుతున్న ఆరేళ్ల బాలికతో పీఈటీ అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకు ఈ నెల 23న పోక్సో కేసు నమోదు చేశామన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఈ కేసులో డీఎస్పీ స్థాయి అధికారి విచారణ చేస్తున్నారని, నిందితుడిపై హిస్టరీ షీట్ ఓపెన్ చేస్తామన్నారు. పాఠశాలలో జరిగిన ఆందోళనలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయని, ఏఆర్ కానిస్టేబుల్ కాలు విరిగిందని తెలిపారు. అల్లర్లు సృష్టించిన వారిని సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించి కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే కొందరి పేర్లతో జాబితా రూపొందించామని, వారిలో దాడులకు పాల్పడిన వారిని గుర్తిస్తామన్నారు. చిన్నారి ఆరోగ్యంపై సోషల్ మీడియాలో వదంతులు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. జీవదాన్ పాఠశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, డీఎస్పీలు పాల్గొన్నారు.

### కిసాన్ షాపింగ్ మాల్ ప్రారంభం

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్‌లో ఏర్పాటుచేసిన కిసాన్ మెన్స్‌వేర్ షాపింగ్ మాల్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా బుధవారం ప్రారంభించారు.



## పచ్చందాల నడుమ ప్రయాణం

**చుట్టూ పచ్చని ప్రకృతి..** నడుమ నల్లతాచులా వంకర్లు తిరిగిన రహదారి.. ఆ మార్గంలో ప్రయాణిస్తుంటే మాటల్లో చెప్పలేనంత ఆనందం కలుగుతుంది. నగర శివారులోని చిన్నాపూర్ అర్బన్ పార్కు సమీపంలో నెలకొన్న ఆహ్లాదకర వాతావరణం ప్రయాణికులకు అందమైన అనుభూతిని పంచుతుంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



## ప్రభుత్వ బడుల్లో వసతులే లేవు

**-ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి**

నందిపేట్, సెప్టెంబర్ 25: ప్రభుత్వ హాస్టల్‌లో సామాన్యుల పిల్లలు మాత్రమే చదువుతారని, వారికి కనీస సౌకర్యాలు కూడా లేవని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. నందిపేట్ మండలం ఖుద్వాన్‌పూర్‌లోని ఎస్సీ, బీసీ హాస్టళ్లతో పాటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. పిల్లలతో కలిసి అల్పాహారం చేసిన ఎమ్మెల్యే.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యం సరిగా లేదని, శిథిలావస్థలో ఉన్న భవనంలో ఉంటున్నామని, ఇతర సమస్యలు ఉన్నాయని విద్యార్థులు చెప్పారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని రాకేశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ప్రపంచంలో అత్యున్నత గౌరవమైన వృత్తి ఉంటే ఉపాధ్యాయ వృత్తేనని ఎమ్మెల్యే అన్నారు. టీచర్లు సమయానికి బడికి రావాలని, విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రతీది ప్రభుత్వమే చేయాలంటే కుదరదని, నీరు వృథాగా పోకుండా నల్లా పెట్టేందుకు ప్రభుత్వమే రూ.100 ఇవ్వాలంటే సమంజసం కాదన్నారు. ప్రతీ దానికి ప్రభుత్వంపైనే ఆధారపడకుండా చిన్నచిన్న పనులు చేసుకోవాలన్నారు.



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

## పట్టుబడిన పేకాట రాణులు

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 25: నగరంలోని సరస్వతీనగర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానలో పేకాడుతున్న మహిళలను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పక్కా సమాచారం అందడంతో ప్రైవేట్ దవాఖానలోని నాలుగో అంతస్తులో తనిఖీ చేయగా, ఐదుగురు మహిళలు పేకాడుతూ పట్టుబడ్డారని వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మహిళలపై కేసు నమోదు చేశామని చెప్పారు. పట్టుబడిన వారంతా ప్రముఖుల భార్యలేనని తెలిసింది.



మహిళల వద్ద నుంచి సీజ్ చేసిన నగదు, సెల్‌ఫోన్లు